

23మంది యజమానులపై కేసు
● ఆధారాలు లేకుండా విదేశీయులకు ఇళ్లు అద్దెకు ఇచ్చిన వారిపై పోలీసుల కొరడా

7

బిమ్స్ ఆస్పత్రిలో నకిలీ నర్సు
● రెండు నెలల నుంచి యథేచ్ఛగా వార్డుల్లో విధులు
● అవాక్కయిన వైద్యులు



హైస్కూల్ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలతో సీఎం సిద్దరామయ్య, మంత్రులు



పీయూ కళాశాల ఉత్తమ అధ్యాపకులు

విద్యాలయాల్లో కులం పేరు సరికాదు

● కులవ్యవస్థతోనే లోపించిన సమానత్వం ● విద్యకు సంపూర్ణ సహకారం ● ఉపాధ్యాయ దినోత్సవంలో సీఎం

బెంగళూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): కుల వ్యవస్థ కారణంతోనే సమాజంలో సమానత్వం లోపించిందని, విద్యాలయాల్లో కులం పేరు రాయడం సహేతుకం కాదని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. విద్యకు సంపూర్ణ సహకారం తమ ఆశయమని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదికి రూ. 65వేల కోట్లు విద్యాశాఖకు ఖర్చు చేస్తోందని సీఎం సిద్దరామయ్య అన్నారు. విధానసౌధ బ్యాంక్వెట్‌హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ దినోత్సవంలో సీఎం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రాథమిక పాఠశాలలో రాజప్ప మాస్టారు నుంచి నేర్చుకున్నానని, రాజకీయ పాఠాలు ప్రొఫెసర్ నంజుండస్వామి ద్వారా తెలుసుకున్నానని వారిద్దరికీ మరోసారి ధన్యవాదాలన్నారు. మనసమాజంలో సమస్యలకు స్పందించే మనఃస్థితి రూపొందించే విధంగా విద్య ఉండాలన్నారు. కేవలం పాత్రను నింపినట్లుగా విద్య ఉండరాదన్నారు. పిల్లల్లో కొత్త ఆలోచనలు కలిగించే విద్య మహత్తరం కానుందని కొనియాడారు. కొన్నేళ్ల క్రితం శూద్రులకు విద్య అవకాశం లేదని, రాజ్యాంగం అందరికీ తప్పని సరి చేసిందన్నారు. మా ప్రభుత్వం వచ్చాక రాజ్యాంగపీఠికను అర్థం వచ్చేలాంటి పనులు చేస్తున్నామన్నారు. కులవ్యవస్థ ఉండేంతవరకు సమాజంలో మార్పులు రావన్నారు. మానవత్వం రూపొందేలా విద్య ఉండాలన్నారు. విద్య నేర్చుకునేందుకు కులం పేరు తీసుకురావడం సరికాదన్నారు. మూఢనమ్మకాలను ఆచరించడం విద్యకు చేసే మరో ద్రోహమేఅన్నారు. చదువు సంస్కారం, ఆధునిక శాస్త్రీయత, మానవత్వం, పరధర్మం, నైతిక విలువలు నేర్పాలన్నారు. డాక్టర్లు ప్రొఫెసర్లు కూడా తలరాతను నమ్ముకున్నారని, ఇంజనీర్లుగా కొనసాగేవారు కులాలపై చర్చిస్తారని ఇటువంటి అంశాలు నేను పరిశీలించానన్నారు. కుల వ్యవస్థ కారణంతోనే సమాజంలో సమానత్వం రాలేదన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ నైతిక విలువలకు ప్రాధాన్యం ఇచ్చారని, ఓ ఉపాధ్యాయుడు రాష్ట్రపతిదాకా ఎదిగారన్నారు. నేటి విద్యార్థులు మొబైల్ వీడి పుస్తకాన్ని పట్టుకోవాలని సూచించారు. ఈ విధానం ఉపాధ్యాయులు పాటించాలన్నారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల ఉపాధ్యాయులు, అధ్యాపకులను ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి మధుబంగారప్ప, ఉన్నతవిద్యాశాఖ మంత్రి ఎంసీ సుధాకర్ పాల్గొన్నారు.

బాను ముస్తాక్ దసరా ఉత్సవాలకు వెళ్లరాదు



● మాజీ ఎమ్మెల్సీ అబ్దుల్ అజీం

బెంగళూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక మైసూరు దసరా ఉత్సవాలను బుకర్‌ప్రైజ్ విజేత బాను ముస్తాక్ ప్రారంభించరాదని జేడీఎస్ మాజీ ఎమ్మెల్సీ అబ్దుల్ అజీం డిమాండ్ చేశారు. బెంగళూరులో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆధ్యాత్మిక నమ్మకాల పండుగ అయినందును గతంలో ఎలా కొనసాగిందో అదే సాంప్రదాయాన్ని కొనసాగించాలన్నారు. బాను ముస్తాక్‌పట్ల తనకు గౌరవం ఉందన్నారు. ఒక ధార్మిక నమ్మకానికి భంగం కలిగేలా వ్యవహరించరాదన్నారు. మైసూరు దసరా లౌకికవాద సంకేతమైనా ఇది పూర్తిగా హిందువుల పండుగ అని ఇందులో ఎలాంటి అనుమానం లేదన్నారు. మైసూరు రాజులకాలం నుంచి హిందువులే ప్రారంభించారన్నారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం, సాహితీవేత్త నిసార్ అహ్మద్‌ల అంశమే వేరన్నారు. దసరా ఉత్సవాల ప్రారంభానికి ఆహ్వానించినప్పుడు అంగీకరించకుండా ఉంటే గౌరవం మరింత పెరిగేదన్నారు. ఒక మతానికి సంబంధించిన నమ్మకానికి ప్రశ్న లాంటిదన్నారు. కాగా ఈనెల 3న బుధవారం రాష్ట్ర రక్షణాసేన కార్యకర్తలు హాసన్‌లో బాను ముస్తాక్ ఇంటికి వెళ్లి దసరా ఉత్సవాలను నిరాకరించాలని ఓ వినతిపత్రాన్ని ఇచ్చారు. గౌరవంగానే మీరు భువనేశ్వరిదేవికి వ్యతిరేకంగానే మాట్లాడారని, దసరా జాతీయ పండుగ అయినా అది హిందువుల ఆచరణ అని వివరించారు. అయితే అదే రోజున మైసూరు జిల్లా యంత్రాంగం బాను ముస్తాక్‌ను కలసి అధికారికంగా ఆహ్వానించారన్నారు.

కాగా సద్భావనా యూత్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ అనే ముస్లిం సమాజ సంఘం అధ్యక్షుడు సాదిక్‌పాషా బెంగళూరులో మాట్లాడుతూ హిందు ముస్లింల మధ్య సంఘర్షణ సృష్టించేలా కాంగ్రెస్ పార్టీ నీచ రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. దసరా ఉత్సవంలో చాముండేశ్వరిదేవిని పూజిస్తే హిందువులకే కాదని ముస్లింల ఆధ్యాత్మిక భావనలకు బాధ కలుగుతుందన్నారు. కానీ హిందూ జనజాగృతి సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి మోహన్‌గౌడ మాట్లాడుతూ సనాతన ప్రభాతకు అనుగుణంగా హిందూ ఆధ్యాత్మికత ప్రకారం దేవిని పూజించేందుకు బాను ముస్తాక్ సిద్ధం కావడం మంచి పరిణామమన్నారు. కానీ నాడదేవత భువనేశ్వరిదేవిని ఆమె అవమానం చేశారని చిక్కమగళూరు దత్తపీఠానికి ముస్లింలు ప్రవేశించేందుకు అవకాశం కల్పించాలని హిందూ వ్యతిరేక డిమాండ్‌ను ప్రతిపాదించారని గుర్తు చేశారు.

నియామకాల ప్రక్రియ నిలిపివేత



● 80 వేల పోస్టుల జీఓలకు బ్రేక్
● వర్గీకరణ రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయ్యేవరకు..
● కేబినెట్ నిర్ణయంతో నిరుద్యోగులకు షాక్

బెంగళూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలుకు సంబంధించి మహత్తరమైన నిర్ణయం తీసుకుంది. అయితే రాష్ట్రంలో వివిధశాఖలలో నియామకాల ప్రక్రియకు బ్రేక్ పడినట్టయ్యింది. గురువారం మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఇప్పటికే జారీ చేసిన 80వేల పోస్టుల నియామక గెజిట్‌లను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. మరికొన్ని రోజులలోనే ఉద్యోగం లభిస్తుందని, అందుకు తగిన రీతిలో పరీక్షలకు సిద్ధమవుతున్న ఆశావహులకు షాక్ ఇచ్చినట్టయ్యింది. 2024 అక్టోబరు 28 తర్వాత ప్రభుత్వం ఏ ఉద్యోగాలకు నేరుగా నియామకాలకు జారీ చేసిన అన్ని గెజిట్‌లు తక్షణం అమలులోకి వచ్చేలా రద్దు చేశారు. ఎస్సీ వర్గీకరణ అమలులోకి వచ్చిన తర్వాతనే కొత్తగా ఉద్యోగాల నియామకాలకు గెజిట్‌ను టైంబౌండ్ ప్రకారం నియామక ప్రక్రియ జరిపేలా ఆదేశించారు. గతంలో నేరుగా నియామకాలకు గెజిట్ జారీ చేసినా ఆ తర్వాత సవరణ గెజిట్‌లను విడుదల చేసినా అటువంటి ఉత్తర్వులన్నీ రద్దు కానున్నాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. రద్దు అయిన గెజిట్‌లకు బదులు ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్లకు అనుగుణంగా కొత్త గెజిట్‌లను విడుదల చేస్తామని ప్రకటించింది. రాష్ట్రమంత్రివర్గం తీసుకున్న నిర్ణయం సమానత, న్యాయబద్ధమైన రిజర్వేషన్ పంపిణీ, సమగ్ర సమాజ నిర్మాణం సాధించేందుకు మరో మహత్తరమైన అడుగు వేసినట్లుగా ప్రభుత్వం తెలిపింది. అన్ని నియామకాల ప్రాధికారలు, మండలులు ఈ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని సూచించింది. గత అక్టోబరులో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు బదులుగా కొత్త తీర్మానాలు తీసుకోనున్నారు. గతంలో ప్రకటించిన అన్ని నియామకపు గెజిట్‌లను వాపసు తీసుకునే నిర్ణయాన్ని మంత్రివర్గం అంగీకరించింది. రాష్ట్ర మంత్రివర్గం ఎస్సీ 101 ఉపకులాలను గుర్తించి వాటి విభాగాలకు అనుగుణంగా 3 గ్రూపులుగా ఏర్పాటు చేసి 17శాతం రిజర్వేషన్‌ను పంచిపెట్టింది. మొదటి, రెండవ కేటగిరీలకు 6శాతం, మూడో కేటగిరీకి 5శాతం రిజర్వేషన్ ఇవ్వదలిచారు. ఇందుకోసం ఉద్యోగులు, పాలనా సంస్కరణలశాఖ రోస్టర్‌లను ఖరారు చేసి వాటిని గ్రాంటెడ్ పోస్టులుగా నిర్ధారించాలని సూచించింది. కొత్త తీర్మానంతో పోలీసు, విద్య, వ్యవసాయ, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధితోపాటు పలు శాఖలలో 80వేలకుపైగా పోస్టుల నియామక ప్రక్రియ తాత్కాలికంగా స్తంభించినట్టయ్యింది. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి కమిషన్ నివేదిక వచ్చేంతరకు కొత్త నియామక గెజిట్‌ను జారీ చేసేది లేదని స్పష్టం చేసింది. ప్రస్తుతం వర్గీకరణ ప్రక్రియ ముగియడంతో తాత్కాలికంగా నియామక ప్రక్రియకు బ్రేక్ పడినట్టయ్యింది. అయితే ప్రభుత్వ నిర్ణయంతో కొన్ని నెలలుగా ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న వారికి నిరాశ మిగిల్చింది. కొత్తగా ఆదేశాలు జారీ అయ్యేంతవరకు నియామకాలు జరిగే అవకాశాలు లేవు.



విజయనగర్‌లో ఓనం సంబరాల్లో కేరళ వాసులు

నగరంలో ఓనం సంబరాలు

7

● అలంకరణతో కేరళ వాసుల సందడే సందడి
● శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు

వేడుకగా మిలాద్-ఉన్-నబీ

బ్యాలెట్ ఎన్నికలు సబబే : సీఎం



బెంగళూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ బెంగళూరుతోపాటు భవిష్యత్తులో జరిగే అన్ని స్థానిక సంస్థల ఎన్నికలను బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించే నిర్ణయంపై సీఎం సిద్దరామయ్య సమర్థించుకున్నారు. శుక్రవారం బెంగళూరులో సీఎం మీడియాతో మాట్లాడుతూ ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ రూపంలో ఎన్నికలు జరపాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇందుకు మా అనుభవానికి అనుగుణంగా తీర్మానించామన్నారు. ఇప్పటికీ ఎన్నో దేశాలు బ్యాలెట్ పేపర్ పద్ధతిన ఎన్నికలు జరుపుతున్నాయన్నారు. కాగా ఇదే విషయమై డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ బ్యాలెట్ పేపరుతో ఎన్నికలంటే బీజేపీకి ఎందుకు భయమని ఎద్దేవా చేశారు. బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలను బ్యాలెట్ ద్వారా జరపాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే బీజేపీవారికి భయమెందుకన్నారు. మేం లోక్‌సభ ఎన్నికలలో పరిశీలిస్తున్నామని, సహకారసంఘాల ఎన్నికలు మాత్రమే బ్యాలెట్ ఉంటుందన్నారు. శాసనసభ, లోక్‌సభ ఎన్నికలు కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్ణయానికి అనుగుణంగానే జరుగుతాయన్నారు.

పెద్దోళ్లూ పేదలే..!







ఐటీ రిటర్న్స్, కార్లు ఉన్నా కంపెనీ డైరెక్టర్లు అయినా బీపీఎల్ కార్డులు
పక్కరాష్ట్రాల వారికి 57,864
రాష్ట్రవ్యాప్తంగా 8లక్షలకు పైగా అనర్హుల గుర్తింపు
రద్దుకు సిద్ధమైన ప్రభుత్వం

అనుమానాలు వీరిపైనే

ఈ-కేవైసీ చేయనివారు	6,16,196
1.20 లక్షలకంటే వార్షిక ఆదాయం ఎక్కువ ఉన్నవారు	5,13,613
ఇతర రాష్ట్రాలకు చెందినవారి కార్డులు	57,864
7.5 ఎకరాలకంటే ఎక్కువభూమి ఉన్నవారు	33,456
ఆరు నెలలుగా రేషన్ పొందనివారు	19,893
కంపెనీల్లో డైరెక్టర్లుగా కొనసాగేవారు	19,690
రూ.25లక్షలకుపైగా లావాదేవీలు కల్గినవారు	2,684

బెంగళూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీపీఎల్ కార్డులు యథేచ్ఛగా దుర్వినియోగం అవుతున్నాయి. ఏకంగా పన్ను చెల్లింపుదారులు, కంపెనీ డైరెక్టర్లు, బడా వ్యాపారులు సైతం తెల్లకార్డులను కలిగిఉన్నారు. వీటన్నింటి రద్దుకు ప్రభుత్వం సిద్ధం అయ్యింది. ఒకప్పుడు ప్రభుత్వ పథకాలను, బీపీఎల్ కార్డులను సులభతరంగా పొందే వెసలుబాటు ఉండేది. రాజకీయ నాయకులు సిఫారసు చేసినా, రెవెన్యూ అధికారులను ప్రసన్నం చేసుకున్నా బీపీఎల్ కార్డు సులభంగా దక్కేది. ఇప్పటికీ అత్యధికమంది అర్హత లేకున్నా బీపీఎల్ కార్డులను ఇదే విధానంతో పొందుతున్నారు. గతంలో ఒక వ్యక్తికి సంబంధించిన ఆదాయం, ఆస్తులు, ఇతరత్రా విలాసవంతమైన విధానాలు, భారీ వాహనాలు ఉన్నా వారి సమగ్ర వివరాలు తెలుసుకునేందుకు వీలుండేది కాదు. కానీ ప్రస్తుతం సాంకేతికత అందుబాటులోకి వచ్చింది. కేవలం ఆధార్‌కార్డు నెంబర్ ఉంటే చాలు ఎటువంటి వ్యక్తి పుట్టుపూర్వోత్తరాలైనా బయటపెట్టొచ్చు. బ్యాంకు రుణాలు పొందే సమయంలో ఐటీ సమర్పించినా, వ్యాపారాలకు సంబంధించిన వ్యవహారాలలో బ్యాంకు ఖాతా వివరాలైనా ఆధార్ అనుసంధానంతో అన్ని వివరాలు క్షణాలలో కంప్యూటర్ స్క్రీన్‌పై కనిపిస్తాయి. రెవెన్యూ, పౌర ఆహార సరఫరాలశాఖ అనర్హత బీపీఎల్ కార్డులను రద్దు చేసేందుకు సిద్ధమైంది.

లక్షల్లో బయటపడ్డ అనర్హులు

నిబంధనలు ఉల్లంఘించి రాష్ట్రవ్యాప్తంగా అనర్హులు పొందిన బీపీఎల్ కార్డులను పౌర ఆహార సరఫరాలశాఖ నిరంతరంగా కార్యాచరణ జరిపి 12,68,097 రేషన్‌కార్డులను గుర్తించింది. వీటిలో 8 లక్షల కార్డులను రద్దు చేసే అవకాశాలు ఉన్నాయి. 12.68 లక్షల కార్డుల్లో 4-5 లక్షల కార్డులు సాంకేతిక లోపాలతోపాటు ఇతరత్రా తప్పులు ఉన్నందున పెండింగ్‌లో ఉంచారు. కొత్త బీపీఎల్ కార్డులు మంజూరు చేయడాన్ని సంబంధితశాఖ నిలిపేసింది. అయితే కార్డుల్లో కొత్తగా పేర్లు చేర్చడం, ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు బెంగళూరు, మంగళూరు వంటి మహానగరాలు, జిల్లా కేంద్రాల్లో మరోచోటుకు వెళ్లినవారికి బదిలీలు, బీపీఎల్ కార్డుల్లో మృతి చెందినవారు లబ్ధిదారులుగా ఉంటే వారి పేర్లు తొలగించే ప్రక్రియకు శాఖాధికారులు అవకాశం కల్పించారు. ఈ ప్రక్రియకు ఎటువంటి అడ్డంకులు లేకుండా కొనసాగిస్తోంది. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాదిమంది బీపీఎల్‌కార్డులు తమ కార్డులలో కొత్త పేర్లను చేర్చుకున్నారు.

గతంలో ఎన్నో సార్లు తొలగింపు

గతంలో బీపీఎల్ కార్డు చేయించిన సందర్భంలో దరఖాస్తులో వార్షిక ఆదాయపత్రం సమర్పించాల్సి ఉండేది. ప్రస్తుతం కార్డుల్లో కొత్తగా చేర్చే పేర్లలో కుమారుడు కుమార్తెలు వారి వార్షిక ఆదాయ ధ్రువీకరణపత్రాన్ని సమర్పించడం ద్వారా సదరు కుటుంబానికి యజమాని, కొత్తగా చేరేవారికి సంబంధించిన ఆదాయ ధ్రువీకరణ పత్రాలను కలిపి పరిశీలిస్తే రూ.2లక్షలకు మించుతుంది. అటువంటి కార్డులను సాంకేతికంగా పెండింగ్‌లో ఉంచారు.

బీపీఎల్ కార్డు కలిగి ఉండాలంటే వార్షిక ఆదాయం 1.20 లక్షల రూపాయలలోపు ఉండాలి. ఇంట్లో కారు, ఇన్‌కమ్‌ట్యాక్స్ చెల్లించేవారు, 7 ఎకరాల మెట్ట, లేదా సాగుభూమి ఉన్నా, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ సంస్థల్లో ఉద్యోగులు, కాంట్రాక్టర్‌గా రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు, బహుళ అంతర్జాతీయ సంస్థల్లో ఉద్యోగాలు, సొంతానికి ఆటో రిక్షా కల్గినవారు మినహా 100 సీసీ కంటే ఎక్కువ సామర్థ్యం కల్గిన ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు కల్గినవారు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి రేషన్ కార్డులు పొందినట్లు గుర్తించారు. ఏటా ఇటువంటి అక్రమ రేషన్‌కార్డులు కల్గిన వారిని గుర్తించి ఎప్పటికప్పుడు కార్డులను రద్దు చేస్తుంటారు. అయినా కొత్తగా కార్డులు పొందుతూనే ఉంటారు. ఉమ్మడి కుటుంబానికి కార్డు ఉంటే పిల్లలు ఉద్యోగస్తులయితే వారిని కార్డునుంచి తొలగించి కార్డులను కొనసాగించుకుంటున్నారు. ఇలా పలు విధాలతో 2023-24లో 74,342, 2024-25లో 91,061 బీపీఎల్ కార్డులను రద్దు చేశారు.

ఇతర రాష్ట్రాలవారే అధికం

రాష్ట్రంలో ఎక్కువమంది ఇతర రాష్ట్రాలకు చెందినవారు నివసిస్తున్నారు. అటువంటివారిలో 57,864 మంది నకిలీ బీపీఎల్ కార్డులను పొందినట్టు గుర్తించారు. వీరు నెలసరి నిత్యావసర వస్తువులు పొందడం ద్వారా ప్రభుత్వానికి కోట్లాది రూపాయల నష్టం కలుగుతోంది. బోగస్ కార్డుల గుర్తించేందుకు, నిత్యావసర వస్తువుల అక్రమాలను నియంత్రించే ఉద్దేశంతో పౌర ఆహార సరఫరాలశాఖ రేషన్‌కార్డులకు ఆధార్ అనుసంధానం (ఈ-కేవైసీ) తప్పని సరి చేసింది. 2019 జూలై 19 నుంచి రేషన్‌కార్డులు కల్గిన ప్రతి సభ్యుడు ఈ-కేవైసీ చేయించుకోవాలనే నిబంధన విధించారు. దీంతో ఇప్పటికే 75శాతం మంది రేషన్‌కార్డులను ఈ-కేవైసీ చేయించుకున్నారు. ప్రస్తుతం బీపీఎల్ కార్డులు కల్గిన కుటుంబీకులంతా ఈ-కేవైసీ చేయించుకోవాలనే నిబంధన ఉంది. ఇప్పటివరకు 6,16,196 కార్డులు ఈ-కేవైసీ చేయించుకోలేదు. వాటిపైనా అనుమానాలు ఉన్నాయి.

రూ.లక్షల్లో పన్ను చెల్లింపు..

బ్యాంకు రుణం పొందేందుకు ఐటీ సమర్పించినప్పుడు రూ.1.20 లక్షల కంటే ఎక్కువ ఆదాయం వచ్చే ఉద్యోగ, వ్యాపారం చేస్తున్నప్పుడు ఆదాయ ధ్రువీకరణ పత్రంలో పిల్లల ఆదాయం చూపినప్పుడు, రేషన్‌కార్డుల్లో పిల్లల పేర్లు చేర్చే సందర్భంగా వారి ఆదాయం నమోదు చేసినప్పుడు, కుటుంబ గుర్తింపు కార్డులు చేసేవేళ, సభ్యుల ఆధార్, పాన్‌కార్డుల వివరాలు ఇచ్చినప్పుడు కుటుంబానికి సంబంధించి సాంకేతిక విధానాలతో పరిశీలిస్తే ఆదాయ వివరాలు తేటతెల్లం అవుతాయి. వివిధ కంపెనీల్లో డైరెక్టర్‌లుగా కొనసాగుతున్న సుమారు 20వేలమంది దాకా నిబంధనలు ఉల్లంఘించి రేషన్‌కార్డులు కలిగి ఉన్నారు. 25లక్షలకంటే ఎక్కువ వ్యాపార లావాదేవీలు కల్గిన 2,684మంది బీపీఎల్ కార్డు కలిగి ఉన్నారు. రేషన్‌కార్డులోని సభ్యులు మరణించినా వారి పేర్లను తొలగించుకోకుండా నిత్యావసర వస్తువులు పొందుతున్నట్లు గుర్తించారు. జాతీయ ఆహారభద్రతా చట్టం ప్రకారం గ్రామీణప్రాంతాల్లో 76.04శాతం, నగర ప్రాంతాలలో 49.36శాతంతో కలిపి 35,87,666 లబ్ధిదారులకు 1,03,70,699 బీపీఎల్ కార్డులు ఇవ్వాలనే నిబంధన ఉంది. అయితే రాష్ట్రంలో ప్రస్తుతం 3,93,29,981 లబ్ధిదారులతో 1,16,51,209 బీపీఎల్ కార్డులు ఉన్నాయి. నిబంధనల ప్రకారం పరిశీలిస్తే 14లక్షల బీపీఎల్ కార్డులు అధికంగా ఉన్నాయి. అనుమానం వచ్చిన కార్డులను నేరుగా పరిశీలనలు జరిపి రెండుసార్లు ఆదాయ ధ్రువీకరణపత్రాలు సమర్పించినవారిని తొలగిస్తున్నారు. అన్ని ప్రక్రియలు పూర్తి చేసి అర్హులు కానివారి రేషన్‌కార్డులను రద్దు చేయదలిచారు.




అనంతపురం నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

సమాజ శ్రేయస్సుకు పాటు పడాలి

- ముస్లిం మత పెద్దలు
- భక్తిశ్రద్ధలతో మిలాద్-ఉన్-నబీ వేడుకలు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రవక్త బోధనలను అనుసరించి సమాజ శ్రేయస్సుకు ప్రతి ముస్లిం పాటు పడాలని మతపెద్దలు పిలుపునిచ్చారు. మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజును పురస్కరించుకుని శుక్రవారం మిలాద్-ఉన్-నబీ వేడుకలను జిల్లా వ్యాప్తంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జిల్లా కేంద్రంతోపాటు ప్రధాన పట్టణాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రతి మసీదు, మదరసా, దర్గాల నుంచి ముస్లింలు జెండాలు చేతబూని ర్యాలీలు నిర్వహించా రు. నగరపాలకసంస్థ మేయర్ వసీం, ముతవల్లిల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఎం షకీల్ షఫి, గ్రంథాలయసంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్, కాంగ్రెస్ నాయకుడు దాదాగాంధీలు ముస్లింలతో కలిసి శాంతిర్యాలీలు చేపట్టారు. పండుగ సందర్భంగా పలు ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం దర్గాలు, మసీదులలో మహమ్మద్ ప్రవక్త పవిత్ర కేశ దర్శనం నిర్వహించారు. జిల్లా కేంద్రంలో రెండో రోడ్డులోని బహవుద్దీన్ మసీద్, పాతూరులోని మాసుమాబీ దర్గా, ఆసార్ దర్గా తదితర ప్రాంతాల్లో పవిత్ర కేశ దర్శనాన్ని నిర్వహించారు. మిలాద్-ఉన్-నబీ వేడుకల్లో భాగంగా నగర ప్రధాన వీధుల్లో బైకు ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలకు జనసేన ఆధ్వర్యంలో వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ మిషన్ రాష్ట్ర డైరెక్టర్ భవానీ రవికుమార్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించారు.



కార్లపై మినార్‌లను ఊరేగిస్తున్న ముస్లింలు



గ్రంథాలయసంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్‌కు శుభాకాంక్షలు చెబుతున్న జనసేన నాయకుడు రవి కుమార్



శాంతిర్యాలీలో పాల్గొన్న మేయర్ వసీం, కేఎం షకీల్ షఫీ, దాదాగాంధీ తదితరులు

కదిలించిన అక్షరం

వేణుగోపాల్ నగర్‌లో విద్యుత్ స్తంభాల ఏర్పాటు

కొత్తచెరువు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' సక్సెస్ మీట్ తరువాత మిగిలిన సమస్యల పరిష్కారం వేగవంతమైంది. పట్టణంలోని వేణుగోపాల్ నగర్‌లో విద్యుత్ శాఖ అధికారులు స్తంభాలను ఏర్పాటు చేయిస్తున్నారు. ఈ నెల 3వ తేదీ స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సక్సెస్ మీట్ జరిగింది. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజలు హాజరయ్యారు. విద్యుత్ స్తంభాలను కాలనీకి చేర్చారని, ఇంకా పాతలేదని ఆ సమావేశంలో స్థానికులు కుళ్లాయప్ప, షాహీదా తదితరులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీంతో ఎల్1, ఎల్2, ఎల్3 కాలనీలలో సిద్ధంగా ఉంచిన 50 విద్యుత్ స్తంభాలను ఆ శాఖ అధికారులు శుక్రవారం వీధుల్లో పాతడం ప్రారంభించారు. కాలనీ ప్రజలు ఆంధ్రజ్యోతి-ఏబీఎన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, పార్టీ నాయకురాలు తులసి, విద్యుత్ శాఖ ఏఈ వెంటేశ్ నాయక్, కాంట్రాక్టర్ శ్యామ్ సుందర్ రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.



వేణుగోపాల్‌నగర్‌లో విద్యుత్ స్తంభాలు నాటుతున్న సిబ్బంది

అక్రమార్కులకు అగ్రిగోల్డ్

- సీఐడీ అటాచ్‌లో అగ్రిగోల్డ్ భూములు
- విలువైన భూముల ఆక్రమణకు యత్నం
- నకిలీ పత్రాలను సృష్టిస్తున్న కబ్జాదారులు



అగ్రిగోల్డ్ భూముల చుట్టు ఉన్న కాంపౌండ్ వాల్‌ను ధ్వంసం చేసిన ఆక్రమణదారులు

కూడేరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): అనంతపురం- బళ్లారి ప్రధాన రోడ్డుకు ఆనుకొని ఉన్న అగ్రిగోల్డ్ భూములు కాజేసేందుకు కొందరు కేటుగాళ్లు ప్రయత్నిస్తున్నారు. ఇక్కడ భూముల విలువ ఎకరం రూ. కోటికి పైగా ఉండటంతో దోచేయడానికి యత్నిస్తున్నారు. సీఐడీ అటాచ్‌లో ఉన్న ఈ భూములను రిజిస్ట్రేషన్ చేస్తున్నారా? లేక నకిలీ పత్రాలను సృష్టించి కాజేసేందుకు కుట్ర పన్నుతున్నారో అంతు చిక్కని రహస్యంగా మారింది.

మండలంలోని కమ్మూరు గ్రామ సమీపంలో దాదాపు 252 ఎకరాలు అగ్రిగోల్డ్ సంస్థ భూములున్నాయి. వైసీపీ పాలనలో కొందరు ప్లాట్లు కొన్నట్లు పత్రాలను సృష్టించుకోవడం, ప్లాట్లను శుభ్రం చేయడం, బాధితులు, సీపీఐ నాయకులు ఆందోళనలతో వెనుదిరగడం పరిపాటిగా మారింది. అగ్రిగోల్డ్ వెంచర్‌లో విలువైన సామగ్రిని దొంగలు ఎత్తుకెళ్లినా ఎవరు పట్టించుకోలేదు. గత ఏడాది నగరానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు అర ఎకరం భూములు కొన్నానని, ఆక్రమించుకోవడానికి శుభ్రం చేస్తుండగా బాధితులు అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులకు సమాచారం అందించగా ఆక్రణదారుడు వెనక్కి తగ్గారు. విషయం తెలుసుకున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, తదితరులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను డిమాండ్ చేశారు. వారం కిందట రాజగోపాల్‌రెడ్డి, సాకే అభిజ్ఞ అగ్రిగోల్డ్ భూముల్లో ఉన్న వాచ్‌మన్ గదితోపాటు కాంపౌండ్ వాల్ రాత్రి సమయంలో ధ్వంసం చేసి ప్లాట్‌ను శుభ్రం చేశారు. ఇంత జరుగుతున్న రెవెన్యూ అధికారులు, పోలీసులు పట్టించుకోలేదు. శ్రీలక్ష్మి వెంకటేశ్వర గార్డెన్ డెవలపర్ పేరుతో 22 ఎకరాలు 2014లోనే రాజగోపాల్ రెడ్డి కొనుగోలు చేశారని, భూమి మొత్తం సీఐడీ అటాచ్‌లో ఉందని, 2023లో అభిజ్ఞ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకొన్నట్లు పత్రాలను పుట్టించి ఆక్రమించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

ఆక్రమణదారులు రాకుండా చర్యలు

అగ్రిగోల్డ్ భూముల్లో ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం. వెంచర్‌లో ఉన్న భవనం కూల్చివేసిన వారి నుంచి వివరాలను సేకరిస్తున్నాం. సీఐడీ ఆధీనంలో ఉన్న అగ్రిగోల్డ్ భూముల్లో ప్లాట్లు కోర్టు ఆదేశాలుంటే పరిశీలిస్తాం. అంత వరకు ఎవరు ఆ భూముల్లోకి వెళ్లకూడదు.

\- మహబూబ్‌బాషా, తహసీల్దారు కూడేరు

మళ్లీ.. నేల చూపులు..!

- వారంరోజులుగా తగ్గుముఖం పట్టిన టమోటా ధరలు
- దారుణంగా పడిపోతున్న వైనం
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు



కక్కలపల్లి మార్కెట్‌లోని మండీలకు వచ్చిన టమోటాలు

అనంతపురం రూరల్/ఆత్మకూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): టమోటా ధరలు నేలచూపులు చూస్తున్నాయి. కొన్నాళ్లుగా నిలకడగా సాగుతున్న ధరలు.. పతనస్థాయికి చేరుకుంటున్నా యి. వారం రోజులుగా ధరలు తగ్గుతున్నాయి. కొన్నేళ్లుగా టమోటా ధరలు రైతులకు చేదు అనుభవాలనే మిగిల్చాయి. నిలకడలేని ధరలతో దెబ్బతింటూనే ఉన్నారు. ధర పెరిగింది అనుకునేలోపు.. మళ్లీ తగ్గిపోవడంతో చాలా వరకు న ష్టాలనే చవిచూశారు. గిట్టుబాటు ధర కోసం రో డ్డెక్కిన సందర్భాలు లేకపోలేదు. గతేడాది ఘటనలే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. నష్టాలను దిగమింగుకుని ఈ ఏటా రైతులు పంట పెట్టారు. ఈ సారి సాగు విస్తీర్ణం తగ్గినట్లు సంబంధింత వర్గాల ద్వారా తెలుస్తోంది. దీంతో సీజన్ ప్రారంభం నుంచి ధరలు నిలకడగా ఉం టున్నాయి. రెండు, మూడు నెలలపాటు ధరలు స్థిరంగానే పలికాయి. జిల్లాలోని టమోటా మార్కెట్ల నుంచి ఎగుమతి అయ్యే ప్రాంతాల్లో స్థానికంగా కాయలు మార్కెట్‌కు రాకపోవడం రైతులకు కలిసొచ్చింది. నిత్యం నష్టాలను చవిచూసిన రైతులు కొంత ఊరటనిచ్చాయి. ప్రస్తుతం పరిస్థితులు మళ్లీ మొదటికి తెస్తున్నాయన్నా భయం సంబంధిత వర్గాల్లో నెలకొంటున్నాయి. కొన్ని రోజులుగా ధరల్లో తగ్గుదల కనిపిస్తోంది. వారం రోజులుగా పరిస్థితి మరింతగా దిగజారుతోంది. ధరలు పతనస్థాయికి తీసుకెళ్తున్నాయి. దీంతో సంబంధిత వర్గాల్లో ఆందోళనలు రేగుతున్నాయి.

ప్రారంభంలో బాగున్నా..

టమోటా ధరలు సీజన్ ప్రారంభంలో బాగా పలికాయి. సీజన్ ప్రారంభం నుంచి కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో మేలిరకం కాయలు కిలో రూ.30 నుంచి రూ.35 మధ్య పలుకుతున్నాయి. గత నెలలో రూ.40 నుంచి రూ.47 వరకు పలికాయి. అంటే పదిహేను కిలోల బాక్సు రూ.600 నుంచి రూ.700 మధ్య అమ్ముడుపోయింది. సరాసరి గత రెండు, మూడు నెలలు 15కిలోల బాక్సు రూ.350 నుంచి రూ.400 పలికినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ క్రమంలో రైతులకు లాభాలను తెచ్చిపెట్టాయి. గత వారం రోజులుగా పరిస్థితులు మారిపోయాయి. కిలో రూ.25 లోపే పలుకుతున్నాయి. గురువారం ధరలు మరింత దిగజారిపోయాయి. కిలో గరిష్ఠ ధర రూ.15తో అమ్ముడుపోయాయి. దీంతో ధరను చూసి రైతులు ఆందోళన చెందుతున్నారు.

తగ్గుతున్న ఎగుమతులు..

జిల్లాలో ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తున్నాయి. ఎగుమతులు మందగించాయంటూ మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఆ ప్రభావం ప్రస్తుత ధరలపై పడుతోందంటున్నారు. జిల్లాలోని మార్కెట్ల నుంచి పక్క రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణతోపాటు ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు టమోటా ఎగుమతి అవుతోంది. ప్రస్తుతం ఆయా మార్కెట్లకు స్థానికంగా కాయలు వస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఎగుమతులు లేక ధరలు తగ్గుతున్నట్లు వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. జూలై, ఆగస్టు నెలల్లో జిల్లాలోని మార్కెట్లలో కాయలు కొనుగోలు చేసేందుకు వ్యాపారులు పోటీపడ్డారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయిందని రైతులు అంటున్నారు. ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చిన కొందరు వ్యాపారులు సొంత ప్రాంతాలకు వెళ్లిపోతున్నట్లు తెలుస్తోంది. అమ్మకాలు తగ్గిపోవడంతో రెండు, మూడు బండ్లు లోడుచేసే వ్యాపారులు ఒకటికి చాలు అనేస్తున్నట్లు సమాచారం.

గత వారం రోజులుగా కక్కలపల్లి మార్కెట్‌లో టమోటా ధరల వివరాలు...

తేదీ	మార్కెట్‌కు వచ్చిన టమోటా (టన్నుల్లో..)	గరిష్ఠ ధర (కిలో రూ.)	సరాసరి ధర (కిలో రూ.)	కనిష్ఠ ధర (కిలో రూ.)
ఆగస్టు 29	3,225	23	19	14
ఆగస్టు 30	3,225	23	19	14
ఆగస్టు 31	3,000	25	19	14
సెప్టెంబరు 1	2,850	26	19	14
సెప్టెంబరు 2	3,000	23	18	14
సెప్టెంబరు 3	3,375	21	17	14
సెప్టెంబరు 4	3,075	15	13	10

కూలీల ఖర్చులు కూడా వచ్చేలా లేవు



రెండు విడతల్లో టమోటా సాగు చేశా. తొలి విడతలో ఎకరంలో పెట్టా. రెండవ విడతలో ఒకటిన్నర ఎకరాల్లో సాగు చేశా. పెట్టుబుడులు భారీగానే వచ్చాయి. మొదటి కోతలో 60బాక్సులు అయ్యాయి. బాక్సు రూ.280, రెండో కోతలో వంద బాక్సులు రూ.200తో అమ్ముడుపోయాయి. మూడో కోత కోసి 180 బాక్సులు తీసుకొచ్చా. బాక్సు రూ.120తో అమ్ముడుపోయింది. ఖర్చులు, బాడుగలు, కమీషన్ ఇతరత్రా రూపాల్లో వచ్చిన ధరలో సగం మార్కెట్‌లోనే పోతోంది. ఈ ధరతో పంటకోసిన కూలీల ఖర్చులు కూడా దక్కేలా లేవు.

\- రామన్న, దేవిరెడ్డిపల్లి, రాయదుర్గం మండలం

పెట్టుబడులైనా దక్కుతాయో.. లేదో..?



మూడు ఎకరాల్లో టమోటా సాగు చేశా. పెట్టుబడుల రూపంలో రూ.2లక్షలకు పైగానే ఖర్చు అయింది. ఇప్పటి వరకు ఐదు కోతలు కోశా. కొంత వరకు పెట్టుబడి వచ్చింది. పదిరోజులుగా ధరలు తగ్గిపోతున్నాయి. ధరల తగ్గుదల చూస్తుంటే భయమేస్తోంది. కనీసం పెట్టుబడులైనా దక్కుతాయో.. లేదో.. చూడాలి.

\- ఎర్రిస్వామి, ఆత్మకూరు

మరుభూమిని సైతం..!

- ఆక్రమణల్లో ఎస్సీల శ్మశాన వాటిక
- ఇబ్బంది పడుతున్న మర్తాడు ఎస్సీలు



మర్తాడులో ఆక్రమణకు గురవుతున్న ఎస్సీల శ్మశాన వాటిక

గార్లదిన్నె, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ధరలు పెరగడంతో కబ్జాదారులు మరుభూమిని సైతం వదలకుండా ఆక్రమిస్తున్నారు. మండలంలోని మర్తాడు గ్రామంలో ప్రభుత్వం ఎస్సీలకు కేటాయించిన శ్మశాన వాటిక స్థలాన్ని ఆక్రమిస్తున్నారని గ్రామ ఎస్సీలు వాపోతున్నారు. గ్రామంలో సుమారు 500 ఎస్సీ కుటుంబాలు ఉన్నాయి. గ్రామానికి సమీపంలో రెండెకరాల స్థలంలో వీరికి శ్మశాన వాటికను ప్రభుత్వం కేటాయించింది. అయితే శ్మశాన వాటికకు దగ్గరల్లో ఉండే వారు కాలక్రమేణ ఈ స్థలం ఆక్రమించుకుంటూ ఇళ్లు నిర్మించుకుంటున్నారని గ్రామస్థులు ఆరోపి స్తున్నారు. ఎస్సీల శ్మశాన వాటికకు కేటాయించిన స్థలం ఆక్రమణకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే వదిలేస్తే శ్మశాన వాటికను పూర్తిగా అక్రమించుకుంటారని ఆందోళన చెందుతున్నారు.

భద్రత కల్పించాలి : పెద్దన్న మర్తాడు



గ్రామంలో ఉన్న ఎస్సీలకు రెండెకరాల్లో శ్మశానవాటికను ప్రభుత్వం కేటాయించింది. గ్రామంలో ఎస్సీలు మృతి చెందితే అందులోనే అంత్యక్రియలు నిర్వహిస్తున్నాం. అయితే శ్మశాన వాటిక సమీపంలో ఉన్న వారు కొందరు శ్మశాన స్థలాన్ని ఆక్రమించుకుని ఇళ్లు కట్టుకున్నారు. అధికారులు స్పందించి ఎస్సీల శ్మశాన వాటిక ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలి.

ఫిర్యాదు చేసిన స్పందించలేదు



ఎస్సీల శ్మశాన వాటిక ఆక్రమణకు గురి అవుతోందని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేదు. ఇటీవల మర్తాడు ఎస్సీ కాలనీలో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశా. సర్వే చేయించి ఉపాధి హామీ ద్వారా శ్మశాన వాటికకు కంచె వేయిస్తామని తహసీల్దార్ చెప్పారు. సర్వే చేయిస్తే ఆర్డీటీ గ్రామ స్వరాజ్ నిధి ద్వారా శ్మశాన వాటికకు కంచె వేయించుకుంటాం.

\- బూడిద కిష్ట, మర్తాడు

చురుగ్గా సూపర్ హిట్ పనులు

- సభాస్థలిని పరిశీలించిన మంత్రి కొల్లు
- హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

అనంతపురం క్రైం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ సూపర్ హిట్ బహిరంగ సభ నిర్వహణకు అనంతపురంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. జీఎంఆర్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్లను ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర శుక్రవారం పరిశీలించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఆప్కాబ్ చైర్మన్ గండి వీరాంజినేయులు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, అహుడా చైర్మన్ టీసీ వరుణ్, ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి తదితరులతో కలసి సభాస్థలిని పరిశీలించారు. మ్యాప్ తెప్పించుకుని బహిరంగ సభ, హెలీ ప్యాడ్, పార్కింగ్ స్థలాల వివరాలను తెలుసుకున్నారు. సభ విజయవంతమయ్యేలా ఏర్పాట్లు చేయాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు రామలింగారెడ్డి, గాజుల ఆదెన్న, నాగరాజు, నాయకులు గంగారామ్, సుధాకర్ యాదవ్, లక్ష్మీనరసింహ, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



హెలీప్యాడ్ పనులను పరిశీలిస్తున్న సీఎం ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ, కలెక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ జగదీష్, టీడీపీ రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్ బీవీ వెంకటరాముడు తదితరులు

హెలీప్యాడ్ వద్ద ఏర్పాట్లు

అనంతపురం-బెంగళూరు జాతీయ రహదారిలోని టాటా మోటార్స్ ఎదురుగా ఉన్న స్థలంలో రెండు హెలీప్యాడ్‌ల ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ పనులను ముఖ్యమంత్రి కార్యక్రమాల కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణ రాజు, కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీశ్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, టీడీపీ రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్ బీవీ వెంకటరాముడు పరిశీలించారు. ఆ ప్రాంతంలో ఉన్న రేకుల షెడ్లు తొలగించాలని, మరో మట్టి లేయర్ వేసి, రోలింగ్ చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కేశవనాయుడు, ఆర్అండ్‌బీ ఎస్ఈ మురళీకృష్ణ, ఈఈ రాజగోపాల్, డీఈ కాటమయ్య, తహసీల్దార్ హరికుమార్ పాల్గొన్నారు.



బహిరంగ సభ వేదిక పనులు చేస్తున్న కార్మికులు

బాలికపై అత్యాచారయత్నం

హిందూపురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని ఓ కాలనీలో 13 ఏళ్ల బాలికపై అత్యాచారయత్నం జరిగింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అనురదల్ల ఏడేళ్ల క్రితం ఓ వివాహితను తీసుకొచ్చి కలిసి ఉంటున్నాడు. ఆమె ఓ హోటల్‌లో పనిచేస్తుంటారు. ఇంట్లో లేని సమయం చూసి, ఆమె కూతురుపై అత్యాచారానికి యత్నించాడు. బాధిత బాలికను అనురదల్ల కొన్నాళ్లుగా వేధిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం మరోమారు బాలికపై అఘాయిత్యానికి ప్రయత్నించాడు. భయపడిన బాలిక, కేకలు వేస్తూ బయటకి పరుగులు తీసింది. విషయాన్ని తల్లి వచ్చాక చెప్పింది. ఆమె హిందూపురం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. నిందితుడు పరారయ్యాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీధర్ తెలిపారు.

బొట్టుపెట్టి పిలవండి

- ఇంటింటికీ వెళ్లి ఆడపడుచులను ఆహ్వానించండి
- టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర
- వైసీపీ ఫేక్ ప్రచారం తిప్పికొట్టండి
- ఆప్కాబ్ చైర్మన్ గండి వీరాంజనేయులు
- బహిరంగ సభ విజయవంతం చేద్దాం: ఎమ్మెల్యే దగ్గుపాటి



పార్టీ శ్రేణులనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

అనంతపురం క్రైం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): 'అనంతపురం అర్బన్‌లోని ప్రతి ఇంటికీ వెళ్లండి. ఆడపడుచులకు బొట్టుపెట్టి, సూపర్‌హిట్ సభకు ఆహ్వానించండి. అనంతపురం అర్బన్ నియోజక వర్గం నుంచే లక్ష మంది కదిలి రావాలి' అంటూ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర టీడీపీ శ్రేణులకు సూచించారు. నగరంలోని మారుతీనగర్ సాయిబాబా గుడి కల్యాణ మండపంలో శుక్రవారం మధ్యాహ్నం అర్బన్ టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. అందుకే ఎన్నికల్లో కూటమి పార్టీలకు 175 స్థానాలకు 164 కట్టబెట్టారన్నారు. ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే పింఛన్‌ను రూ.4వేలకు పెంచామన్నారు. దివ్యాంగుల ఫింఛన్ రూ.3 వేల నుంచి రూ.6 వేలకు, బెడ్‌పై లేవలేని స్థితిలో ఉన్న వాళ్లకు రూ. 15 వేలు, దీర్ఘకాలిక జబ్బులతో ఉన్న వాళ్లకు రూ.10 వేలు ఇచ్చామన్నారు. ఏడాది కాలంలోనే పింఛన్ల కోసం రూ.35 వేల కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం తమదేనన్నారు. మహిళలకు ఉచితబస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవన, తల్లికి వందనం 16,400 డీఎస్సీ పోస్టుల భర్తీ ప్రక్రియ ఇవన్నీ కూటమి ప్రభుత్వమే అందించిందని తెలిపారు. ఈ విషయాలన్నీ ప్రజలకు తెలిపేందుకు అనంతపురంలో సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మాట్లాడుతూ గత 44 ఏళ్లలో తొలిసారి అనంతపురంలో భారీ బహిరంగ సభ జరగబోతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మనపై పెట్టిన బాధ్యతను విజయవంతంగా నిర్వహించాలన్నారు. 3.5 లక్షల మంది సభకు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. టీడీపీ జోన్-5 ఇన్‌చార్జ్, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ ఎన్నికల ముందు కష్టపడి కూటమిని గెలిపించారని, ఇప్పుడు ఈ విజయోత్సవ సభను సైతం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అర్బన్ పరిశీలకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 11 సీట్లు ఇచ్చినా జగన్‌కు బుద్ధి రాలేదన్నారు. తిరుమల పవిత్రతను సైతం దెబ్బతియ్యాలని చూశాడని, ఆఖరికి టికెట్లు కూడా అమ్ముకున్నారంటూ మండిపడ్డారు. 10న జరిగే సభను విజయవంతం చేయాలని సూచించారు. అంతకు ముందు ఆప్కాబ్ చైర్మన్ గండి వీరాంజనేయులు మాట్లాడుతూ వైసీపీ నాయకుల ఫేక్ ప్రచారాలను టీడీపీ శ్రేణులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ మాట్లాడుతూ ప్రతి కార్యకర్త ఈ కార్యక్రమాన్ని చాలెంజ్‌గా తీసుకుని విజయవంతం చేయాలని కోరారు. ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు మాట్లాడుతూ అనంతపురం ఉమ్మడి జిల్లా టీడీపీకి కంచుకోట అన్నారు. కార్యక్రమంలో లింగాయత్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ స్వప్న, టీడీపీ రాష్ట్ర, జిల్లా నాయకులు ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, రాయల్ మురళి, జేయల్ మురళి, స్వామిదాస్, మదమంచి స్వరూప, డైరెక్టర్లు పీఎల్ఎన్ మూర్తి, పోతుల లక్ష్మినరసింహులు, బొమ్మినేని శివ, పరమేశ్వర్, కొండన్న, నాయకులు సుధాకర్‌నాయుడు, చేపల హరి, సుధాకర్ యాదవ్, సింగవరం రవి, నెట్టెం బాలకృష్ణ, తేజస్విని, హరి తదితరులు పాల్గొన్నారు.




హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

ఉస్తాద్ అల్లావుద్దీన్ ఖాన్ (వర్ధంతి)




సరోద్ వాద్యకళాకారుడిగా పేరొందిన ఉస్తాద్ అల్లావుద్దీన్ ఖాన్ 1862 అక్టోబరు 8న అప్పటి బెంగాల్ ప్రెసిడెన్సీలోని బ్రహ్మం బరియా (ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో ఉంది)లో జన్మించారు. మల్టి-ఇన్‌స్ట్రు మెంటలిస్ట్‌గాను రాణించారు. 20వ శతాబ్దంలో శాస్త్రీయ సంగీత ఉపాధ్యాయులలో ఒకరిగా నిలిచారు. ఆధునిక మైహర్ ఘరానాతో ఎన్నో రాగాలను ఆధునీకరించారు. పద్మభూషణ్, పద్మవిభూషణ్ పురస్కారం, సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్ గ్రహీత. 110వ యేట 1972 సెప్టెంబరు 6న కన్నుమూశారు.

యశ్ జోహార్ (జయంతి)



బాలీవుడ్ సినీ నిర్మాత, ధర్మా ప్రొడక్షన్స్ సంస్థాపకులు యశ్ జోహార్ 1929 సెప్టెంబరు 6న పంజాబ్ రాష్ట్రం అమృత్‌సర్‌లో జన్మించారు. ఫోటోగ్రాఫర్‌గా కెరీర్ ఆరంభించి నిర్మాతగా ఎదిగి ఎన్నో బ్లాక్‌బస్టర్ సినిమాలను రూపొందించారు. సునిల్‌దత్, దేవానంద్ వంటి నటులతో కలసి పనిచేశారు. కుమారుడు కరణ్ జోహర్ దర్శకత్వంతో నిర్మించిన 'కుచ్ కుచ్ హోతా హై' సినిమా ఎంతో పేరు తెచ్చింది. హాలీవుడ్ సినిమాలకు కూడా భాగస్వామ్యం వహించారు. అందులో 'జంగిల్ బుక్' ఒకటి. పలు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు, నేషనల్ అవార్డులు అందుకున్నారు. 'ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా'లో సీనియర్‌గా వ్యవహరించారు. 2004 జూన్ 26న కన్నుమూశారు. ఆయన కుమారుడు కరణ్ జోహార్ ప్రస్తుతం ధర్మా ప్రొడక్షన్స్‌ను పర్యవేక్షిస్తున్నారు.

రాకేశ్ రోషన్ (పుట్టినరోజు)



హిందీ సినీరంగంలో పేరొందిన నిర్మాత, దర్శకుడు రాకేశ్ రోషన్ లాల్ నగ్రత్ 1949 సెప్టెంబరు 6న బాంబేలో జన్మించారు. తండ్రి, సంగీత దర్శకుడైన రోషన్‌లాల్ నగ్రత్ స్ఫూర్తితో సినీరంగంలో కొనసాగారు. స్క్రీన్‌రైటర్‌గా, ఎడిటర్‌గా, నటుడిగాను రాణించారు. 80కుపైగా సినిమాలలో నటించారు. పలు సినిమాలకు దర్శకత్వం వహించి కొడుకు హృతిక్ రోషన్‌ను 'కహో నా ప్యార్ హై' తో సినీరంగంలోకి ప్రవేశింప చేశారు. సోదరుడు రాజేశ్ రోషన్ సంగీత దర్శకత్వం వహించారు. సినీ రంగంలో పలు విభాగాలలో పురస్కారాలు అందుకున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు



ట్యానరీరోడ్డు ఊరేగింపులో మంత్రి జమీర్ తదితరులు



ఊరేగింపులో వివిధ వాహనాల సందడి

బెంగళూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మిలాద్-ఉన్-నబి వేడుకలను ముస్లింలు సంతోషంగా జరుపుకొన్నారు. మహ్మద్ ప్రవక్త జన్మ దినోత్సవాన్ని మిలాద్-ఉన్-నబి పేరిట జరుపుకోవడం ఆచారంగా ఉంది. ఇస్లాం మతంలో మిలాద్-ఉన్-నబి పండుగకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఇస్లాం మతాన్ని స్థాపించిన ప్రవక్త మహ్మద్‌ను స్మరించుకుంటూ వేడుకలు చేసుకుంటారు. శుక్రవారం బెంగళూరు నగర వ్యాప్తంగా వందలాది వాహనాలలో ఖురాన్ సందేశాలతో ఊరేగింపు జరిగింది. చామరాజపేట, జయనగర్, జేపీ నగర్, ట్యానరీ రోడ్డు, శివాజినగర్‌తోపాటు పలు ప్రాంతాలలో ఊరేగింపులు కొనసాగాయి. అంతర్జాతీయ మిలాద్-ఉన్-నబి వేడుకలను త్రిపురవాసిని ప్యాలెస్‌మైదానంలో జరిగాయి. దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి ముస్లిం మతగురువులు భాగస్వామ్యులయ్యారు.

చింతామణిలో ఘనంగా ఈద్-మిలాద్

చింతామణి: మిలాద్-ఉన్-నబి (ఈద్-మిలాద్) పండుగను పట్టణంతోపాటు చింతామణి తాలూకా వ్యాప్తంగా ముస్లింలు ఘనంగా ఆచరించారు. శుక్రవారం ఎటుచూసినా సందడి నెలకొంది. డీజే సౌండ్ లేకుండా ఊరేగింపులు సాగాయి. దొడ్డపేటలోని జామియా మసీదు వద్దకు చేరుకున్న ముస్లింలు పురవీధులగుండా ఊరేగారు. మహబూబ్‌నగర్, నెక్కుందిపేట, ఆజాద్‌చౌక్, చేళూరు సర్కిల్, డబుల్‌రోడ్డు, ఆజాద్‌చౌక్‌మీదుగా ఈద్గా మైదానానికి చేరుకుని సామూహిక ప్రార్థనలు చేశారు. ఊరేగింపు సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారు. పండుగ సజావుగా సాగడంపై హర్షం వ్యక్తం చేశారు.



చింతామణిలో ప్రధాన కూడలిలో సందడి ఇలా..

నగరంలో ఓనం సంబరాలు



ఇందిరానగర్‌లో....

బెంగళూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగర వ్యాప్తంగా ఓనం సంబరాలు జరుపుకొన్నారు. కేరళ వాసులు ఓనం వేడుకలను ప్రత్యేకంగా జరుపుకొనే సంప్రదాయం ఉంది. బెంగళూరులో స్థిరపడిన కేరళవాసులు నగరవ్యాప్తంగా ప్రత్యేక వేడుకలు జరుపుకొన్నారు. విజయనగర్, ఇందిరానగర్, జయనగర్ తదితర ప్రాంతాలలో ఓనం ముగ్గులు వేసి ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. హొస్కోటెలోని టీజీఎస్‌వీ స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఓనం శైలిలో ఆచరించారు. సంప్రదాయం ఓనంకు అనుగుణంగా పలు క్రీడలు, సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. తాడు లాగుడు పోటీలు, ఉట్టికొట్టడం, కేరళ ట్విస్ట్, సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. ఓనం క్విజ్ పోటీలు జరిపారు. కార్తికేయన్‌తోపాటు ది బెంగళూరు స్కూల్, ది గ్రీన్ స్కూల్ బెంగళూరు ఉషా అయ్యర్ మాట్లాడుతూ ఓనం, ఉపాధ్యాయ దినోత్సవం ఒకేరోజు రావడం సంతోషకరమన్నారు.పలు ప్రాంతాలో ఓనం సందడి నెలకొంది.



ఓ పాఠశాలలో ఓనం సందడి ఇలా...

ఆంధ్ర రుచులకు నందన గుర్తింపు

» ఎమ్మెల్యే శరత్ బచ్చేగౌడ



శాఖను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శరత్‌బచ్చేగౌడ తదితరులు

బెంగళూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రుచులకు నందన ప్యాలెస్ గుర్తింపు కలిగి ఉందని బెంగళూరులో ఏ ప్రాంతానికి వెళ్లినా అందుబాటులో ఉందని హొస్కోటె ఎమ్మెల్యే శరత్‌బచ్చేగౌడ తెలిపారు. హొస్కోటెలో నందన ప్యాలెస్ 28వ శాఖను శుక్రవారం లాంచనంగా ప్రారంభించారు. ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఎస్ఎన్‌వీఎల్ నరసింహరాజు, అడయార్ ఆనంద్‌భవన్ ఎండీ కేటీ వెంకటేశ్ రాజులు ముఖ్యులుగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే శరత్‌బచ్చేగౌడ మాట్లాడుతూ బెంగళూరు అంతర్జాతీయ నగరమని, అందుకు తగినట్టు నాణ్యత, ఆతిథ్యం ఇచ్చే సంస్థలకు గుర్తింపు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా నందన ప్యాలెస్ ఎండీ ఆర్ రవిచందర్ మాట్లాడుతూ వినియోగదారులు నందన రుచుల విశ్వాసంతోనే ప్రాంతాల వారీగా శాఖలు ఏర్పాటు చేశామన్నారు. 1989లో హోటల్ రంగంలోకి వచ్చానన్నారు. మాంసాహార వంటకాలు మా ప్రత్యేకమన్నారు. వినియోగదారులకు రుచి, నాణ్యత కల్గిన ఆహార పదార్థాలను అందిస్తున్నా మన్నారు. ఆంధ్రశైలిలోనే ప్రపంచస్థాయి వంటకాలు మా ప్రత్యేకమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పేరొందిన చికెన్ అమరావతి, గుంటూరు డ్రై మా ప్రత్యేకత అన్నారు. కార్యక్రమంలో బెంగళూరు రెస్టారెంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పీసీ రావ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నందనప్యాలెస్ ఎండీ రవిచందర్ తదితరులు

కొనసాగుతున్న గణపతి వేడుకలు



ఓల్డ్ మద్రాస్ రోడ్డులో..

బెంగళూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో వినాయక చవితి నేపథ్యంలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో గణనాథులను ఇంకా కొలువు దీరుస్తున్నారు. అనుమతి లభించిన ప్రదేశంలో ప్రతిష్ఠలు చేస్తున్నారు. శుక్రవారం కూడా వేర్వేరు చోట్ల ప్రతిష్ఠాపనలు జరిగాయి. ఓల్‌మద్రాస్ రోడ్డుకు అనుబంధంగా ఉదయ్‌నగర్ చిక్కసుబ్బన్నస్ట్రీట్, గణేశ టెంపుల్ రోడ్డులో వినాయక యువజనసంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వమించారు. విశేషపూజలు అనంతరం ఉదయనగర్ ప్రాంత వాసులకు అన్నదానం నిర్వహించారు. సంఘానికి చెందిన వారితోపాటు స్థానిక ప్రముఖులు శ్రీనివాసులు, కృష్ణమూర్తి, ప్రతాప్‌రెడ్డి, హేమచంద్ర, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎస్ఆర్ లే అవుట్...

బొమ్మనహళ్ళి: నియోజకవర్గంలోని హెచ్ఎస్ఆర్ లే అవుట్ ఏడో సెక్టార్‌లో ఏకదంత యువజనసంఘం 12వ వార్షిక వినాయక ఉత్సవాలలో గణనాథుడిని కొలువుదీర్చారు. సంఘం ప్రముఖుడు నవీన్ మాట్లాడుతూ మూడు రోజులపాటు ప్రత్యేక ధార్మిక, సంగీత కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. వినాయక విగ్రహాన్ని హైదరాబాద్‌నుంచి ప్రత్యేకంగా తెప్పించామన్నారు. శుక్రవారం గణపతిహోమం విశేషపూజా కార్యక్రమాలు కొనసాగాయి. నిమజ్జన ఉత్సవం అర్థవంతంగా చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లో భారీ వినాయకుడు ...

చెత్తసంస్కరణ కేంద్రం ప్రారంభం

దొమ్మసంద్ర, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): హాలనాయకనహళ్ళి గ్రామపంచాయతీ పరిధిలోని మునేశ్వర లే అవుట్‌లో చెత్త సంస్కరణా కేంద్రాన్ని ప్రారంభించారు. సుమారు 35 లక్షల రూపాయలతో అర్ధ ఎకరాలో చెత్త విభాగాన్ని ఏర్పాటు చేసినట్టు అధ్యక్షులు తెలిపారు. అధ్యక్షులు సవితా బాబురెడ్డి అధ్యక్షతన సభ్యులు పాల్గొని ప్రారంభించారు. జీబీఏ పరిధిలోకి వచ్చిన తమ పంచాయతీలో ఒక మంచి పనిచేశామన్న తృప్తి ఉందని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ ఉపాధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, సీ వెంకటేశ్, గ్రామపంచాయతీ సభ్యులు మంజునాథ్, గీతా, ఎం శ్వేతా సురేశ్, శివకుమార్, శోభా రమేశ్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చెత్తసంస్కరణ కేంద్రం ప్రారంభోత్సవంలో పంచాయతీ అధ్యక్షులు, సభ్యులు తదితరులు

నగర పంచాయతీ రూపురేఖలు మారుస్తా: మంత్రి

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ రూపురేఖలు మార్చి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. పెనుకొండ పట్టణంలో శుక్రవారం రూ.92లక్షలతో వైజంక్షన్ నుంచి మార్కెట్‌యార్డ్ వరకు సెంట్రల్ లైటింగ్‌కు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి సవిత, అహుడా చైర్మన్ టీసీ వరుణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారి రూ.50 లక్షలతో పూర్తీచేశామన్నారు. ఎప్పటి నుంచే ఇబ్బందులు పడుతున్న కోనాపురం తదితర గ్రామాలకు వెళ్లే రహదారిని రూ. కోటితో, డ్రైనేజీని రూ.50లక్షలతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా రూ.62లక్షలతో శాశ్వతంగా అన్నాక్యాంటిన్ భవన నిర్మాణం జరుగుతుందన్నారు. త్వరలో వంద కోట్లతో నగరపంచాయతీ పరిధిలో ఇంటింటికి తాగునీటిని అందిస్తామన్నారు. ప్రస్తుతం పెనుకొండ నియోజకవర్గ వ్యాప్తంగా వెయ్యి సోలార్‌లైట్లు ఏర్పాటు చేశారన్నారు. అహుడా చైర్మన్ టీసీ వరుణ్ మాట్లాడుతూ పెనుకొండ నగర పంచాయతీకి మరిన్ని నిధులు కేటాయిస్తామన్నారు.

పార్టీ కోసం పనిచేసిన వారికే పదవులు

● మండల కన్వీనర్ గోవిందరెడ్డి

పరిగి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం పనిచేసిన వారికి పదవులు దక్కుతాయని మండల కన్వీనర్ గోవిందరెడ్డి అన్నారు. మండలంలోని శాసనకోట గ్రామానికి చెందిన యూజీ వెంకటేశ్‌ను రాష్ట్ర లైవ్‌స్టాక్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించడంతో స్థానిక నాయకులు మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన్ను సన్మానించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ గోవిందరెడ్డి మాట్లాడుతూ పార్టీకోసం కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. తనకు పదవి ఇచ్చినందుకు సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి సవితను వెంకటేశ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు బాలాజీ, మాజీ ఎంపీటీసీ సోమప్ప, క్లస్టర్ రామాంజి, రఘు, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి మృతదేహం లభ్యం

సోమందేపల్లి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పందిపర్తి గ్రామానికి వెళ్లే రహదారి బ్రిడ్జి వద్ద వృద్ధుడి శవం లభ్యమైంది. స్థానికులు సమాచారాన్ని రైల్వే పోలీసులకు అందించారు. రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. వివరాలు విచారణలో తెలియాల్సి ఉంది.

జయప్రదం చేయండి

సోమందేపల్లి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి ఎస్. రామచంద్రారెడ్డి 82వ జయంతిని పురస్కరించుకుని శనివారం పెనుకొండ మండలం కొండంపల్లి గ్రామంలో మంత్రి సవిత ఆధ్వర్యంలో కార్యక్రమం ఉంటుందని మండల కన్వీనర్ వెంకటేశులు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

సోమందేపల్లి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): యూరియా పంపిణీకి సంబంధించిన సమస్యలపై రైతులు జిల్లా కేంద్రంలోని కమాండ్ కంట్రోల్‌రూమ్‌కు కాల్‌చేసి వివరాలను, ఫిర్యాదులు చేయవచ్చని కలెక్టర్ కార్యాలయం ద్వారా శుక్రవారం ప్రకటన విడుదలైంది. ఈ నేపథ్యంలో స్థానిక వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సమాచారాన్ని అందజేశారు. అవసరమైనవారు నేరుగా 9948224545, 9177768274కు సంప్రదించాలన్నారు.

మహిళా ద్రోహి జగన్ : మంత్రి సవిత

రొద్దం: మహిళా ద్రోహి జగన్మోహన్‌రెడ్డి అని మంత్రి సవిత విమర్శించారు. శుక్రవారం రూ.1.5కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. జగన్‌కు సిలిండర్ల ధరలు పెంచడం తెలుసు కాని ఉచిత గ్యాస్ ఇవ్వడం తెలియదన్నారు. బస్సు చార్జీలు పెంచడం జగన్‌కు ఎరుక గాని మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం చేతకాలేదని ఎద్దేవా చేశారు. చిన్నకోడిపల్లి గ్రామానికి 35 ఏళ్ల కలను సాకారం చేశామన్నారు. డీఆర్ కొట్టాల గ్రామంలో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించడానికి విద్యుత్‌శాఖ మంత్రిని ఆహ్వానించనున్నామన్నారు. చిన్నకోడిపల్లి గ్రామంలో కనకదాస విగ్రహ ఏర్పాటుకు విగ్రహాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజు, టీడీపీ నాయకులు మాధవనాయుడు, నారాయణస్వామి, చిన్నప్పయ్య, వెంకటరామిరెడ్డి, నరహరి, చంద్రమౌళి, వీరాంజనేయులు, రామచంద్ర, అశ్వర్థనారాయణ, పవన్, అరుణ్‌రెడ్డి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

బెళగావి ఆసుపత్రిలో నకిలీ నర్సు



నకిలీ నర్సు

బెంగళూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బెళగావి మెడికల్ కళాశాల ఆసుపత్రికి అనుబంధంగా ఉండే బిమ్స్ ఆసుపత్రిలో నకిలీ నర్సు సేవలందిస్తున్నట్టు గురువారం వెలుగులోకి వచ్చింది. రెండు మూడు నెలలుగా నర్సింగ్ విద్యార్థిగా చెప్పు కొని సేవలందిస్తున్నారు. ప్రతిరోజూ నర్సింగ్ యూనిఫాంలో ఆసుపత్రికి వచ్చి సర్జికల్ వార్డు, ఓపీడీతోపాటు వివిధ విభాగాలలో తిరుగుతూ రోగులకు చికిత్సలు అందిస్తున్నారు. అనుమానం వచ్చి ప్రశ్నించిన వారికి బిమ్స్ డైరెక్టర్ సూచన మేరకు పని చేస్తున్నానంటూ బెదరింపు ధోరణిలో వ్యవహరించారు. ఇలా వార్డులో చికిత్సలు అందిస్తుండగా సెక్యూరిటీ గార్డులు పట్టుకున్నారు. విషయాన్ని ఆసుపత్రి సర్జన్, ఆర్ఎంఓలకు సమాచారం ఇచ్చారు. ఆమె కారవారకు చెందిన సనా షేక్‌గా గుర్తించారు. బెళగావి పట్టణం కుమారస్వామి లే అవుట్‌లో సనా నివసిస్తున్నట్టు గుర్తిం చారు. దీంతో వెంటనే అదుపులోకి తీసుకుని చర్యలకు బిమ్స్ పాలకమండలి సిద్ధమైంది. బిమ్స్ డైరెక్టర్ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి నకిలీ నర్సుపై విచారణ జరపాలని గురువారం ఆదేశించారు.

సమాజసేవతో కుమారుడి జయంతి

బెంగళూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మహాకుంభమేళాకు వెళ్లిన కుమారుడు వసంతపంచమి రోజున మృతి చెందిన కుమారుడి జయంతిని తల్లిదండ్రులు శుభ, వాసుకి ఆచార్యలు సమాజసేవ చేశారు. బనశంకరిలోని ఎమ్మెల్యే అశోక్ కార్యాలయం సమీపంలో శుక్రవారం జరిపారు. శుభ మాట్లాడుతూ కుమారుడిని కోల్పోయి క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఎంపీ తేజస్వి సూర్య, బ్రిగేడియర్ ఎస్‌పీ సింగ్, లెఫ్టినెంట్ కల్నల్ సతీశ్‌శర్మతోపాటు ఎస్‌బీఐ ఉద్యోగులు ఎంతో సహకరించారన్నారు. 12 సంఘసంస్థలు, స్వచ్ఛంద సేవకులకు ఆర్థికంగా తమవంతు సాయం చేశారు. ఒక్కో సంఘానికి రూ.30-40వేల దాకా అందించారు.

విద్యుదాఘాతానికి గురైన యువకుడికి చికిత్స విజయవంతం

బెంగళూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలక్రిందట విద్యుత్ షాక్‌కు గురై తలకు తీవ్రమైన దెబ్బ తగిలిన పశ్చిమబెంగాల్ యువకుడికి చికిత్సలు విజయవంతం చేసినట్టు నగరంలోని మెడికవర్ ఆసుపత్రి న్యూరోసర్జన్ దీపక్ తెలిపారు. ప్రమాదంలో యువకుడి తల కుడిభాగంలో తీవ్రమైన దెబ్బ తగిలింది. ఫంగల్ ఇన్‌ఫెక్షన్ ప్రబలింది. పశ్చిమబెంగాల్‌లో ప్రాథమికంగా చికిత్సలు పొందిన తర్వాత మెడికవర్ ఆసుపత్రికి వచ్చార న్నారు. యువకుడి ఎడమభాగంలోనూ దెబ్బలు ఉన్నట్టు గుర్తించామన్నారు. నిరంతర పర్యవేక్షణలో శస్త్రచికిత్స చేసి సాధారణ ఆరోగ్యవంతుడిని చేశామన్నారు.

సాయి సన్నిధిలో ఓనం వేడుకలు

● అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు





నృత్యం చేస్తున్న చిన్నారులు

పుట్టపర్తి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సత్యసాయి సన్నిధిలో కేరళ భక్తులు ఓనం వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. చివరి రోజు శుక్రవారం సాయికుల్వంత్ మందిరంలో సంగీత, నృత్య ప్రదర్శనలతో అలరించారు. అంతకు మునుపు సత్యసాయి మహా సమాధిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. ఓనం పాటల కచేరీని నిర్వహించారు. మాలప్పురం బాలవికాస్ చిన్నారులు 'పవిత్రాణాయ భక్తానాం' పేరిట నృత్య రూపకాన్ని, పాండురంగ చరిత్రలోని ఘట్టాలను ప్రదర్శించారు. అనంతరం సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

అమరాపురం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆలదపల్లి గ్రామంలో వైసీపీ నుంచి ఐదు కుటుంబాలు టీడీపీలో చేరాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న అభివృద్ధి, సూపర్‌సిక్స్ పథకాలకు ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు హళ్లేరు శ్రీనివాస్, ఉగ్రప్పగారి శివన్న, యాదవ జయప్ప తదితరులు తెలిపారు. పార్టీలో చేరినవారిని ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ స్వరక్క, నరసింహమూర్తి, మాజీ సర్పంచ్ పాండురంగప్ప, పంచాయతీ కన్వీనర్ మాజీ ఎంపీటీసీలు మంజునాథ్, నరసింహమూర్తి, ముద్దయ్య, చంద్రప్ప, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద చెరువుకట్ట ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో ఉన్న రైల్వేగేటువద్ద ఆగిఉన్న లారీని వెనుకవైపు నుంచి మరోలారీ ఢీకొనడంతో డ్రైవర్ శరబన్ తీవ్రంగా గాయపడ్డాడు. కియా ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాల మేరకు పెనుకొండ వైపు నుంచి అనంతపురంవైపు పెయింట్ లారీ వెళ్తోంది. కుంభకర్ణుని విగ్రహం వద్ద రైల్వేగేటు పడటంతో లారీ ఆగింది. ఈ క్రమంలో కర్ణాటక మంగళూరు నుంచి డ్రైవర్ శరబన్ పెంకుమట్టిని తాడిపత్రికి తరలిస్తుండగా ఆగిఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో శరవన్ తీవ్రంగా గాయపడ్డాడు. గంటపాటు శ్రమించి ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను వెలికితీసి ఆసుపత్రికి తరలించారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు


	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగుల)	1625.90	1,632.73
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	44.650	32,877
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	36,232	28,960
నీటి నిల్వ (టీఎంసీలు)	79.47	101.77

24న రెడ్డి జనసంఘం శతాబ్ది ఉత్సవాలు



విలేకరులతో మాట్లాడుతున్న వేమనానందస్వామి

బళ్లారి సిటీ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రెడ్డి జన సంఘం శతాబ్ది ఉత్సవాలను సెప్టెంబరు 24న బెంగళూరులోని ప్యాలెస్ గ్రౌండులో జరుపురోనున్నట్లు రెడ్డి గురుపీఠానికి చెందిన వేమనానంద స్వామీజీ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 400 సంవత్సరాల క్రితం పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ నుంచి కర్ణాటకకు వలస వచ్చిన రెడ్డి సామాజిక వర్గానికి ఒక ప్రత్యేకమైన సంస్కృతి గుర్తింపు ఉందన్నారు. వారి అసలు వృత్తి వ్యవసాయం, వారు నదులు ఉన్న చోట స్థిరపడ్డారు. రాష్ట్రంలో 35లక్షల రెడ్ల జనాభా ఉన్నప్పటికీ 20మందికి పైగా ఎమ్మెల్యేలు ఉన్నారన్నారు. మంత్రి వర్గంలో కూడా కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. రాష్ట్రతొలి ముఖ్యమంత్రి కేసీ రెడ్డి కూడా రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారేనన్నారు. ఈసంఘం ఒక వైద్య కళాశాల మినహా, అన్ని రకాల విద్యా సంస్థలను కలిగిఉందన్నారు. ఈసంఘం తన శతాబ్ది ఉత్సవాలను జరుపుకోవడం హర్షణీయమన్నారు. బెంగళూరులో జరిగే శతాబ్ది ఉత్సవానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రముఖులు , ముఖ్యమంత్రులు పాల్గొంటారన్నారు. బళ్లారి జిల్లా అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే ఏడాది జిల్లా సంఘానికి 75సంవత్సరాలు నిండుతాయన్నారు. వజ్రోత్సవాల సందర్భంగా నగరంలోని సంఘం కార్యాలయ ప్రాంగణంలో కల్యాణ మంటపం రాబోయే ఆరు నెలల్లో పూర్తవుతుందన్నారు. ఇది ఉత్తర కర్ణాటకలో అతి పెద్దదన్నారు. ఈసందర్భంగా సంఘం కోశాధికారి హేమచంద్రారెడ్డి, రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌రెడ్డి, డైరెక్టర్లు బాబురెడ్డిభైరతి,రాజా రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శాంత్‌రాజ్, గణపాల్ ఐనాథ్‌రెడ్డి, సిద్దమ్మనహళ్ళి తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వచన ప్రచార రథయాత్ర

నేడు నగరానికి వచన ప్రచార రథం

బళ్లారి సిటీ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నేటి ప్రజలకు భక్తి వచన సంస్కృతిని తెలియజేయడానికి 'గ్లోబల్ లింగాయత్ మహాసభ' నిర్వహిస్తున్న వచన సంస్కృతి అభియాన్ రథం శనివారం నగరానికి చేరుకోనుంది. వచన సాహిత్యాన్ని పరిరక్షించడం వ్యాప్తి చేయడం లక్ష్యంగా దీనిని చేపట్టారు. లింగాయత్ మఠం బసవలింగ పట్టదేవరు హిరేమఠ్ సంస్థాన్ బాల్కి, శ్రీ జగద్గురు తోంటచార్య సంస్థాన్ మఠం, సిద్ధరామ స్వాములు మొదలైన వారి సమక్షంలో నిర్వహించబడే ఈ ప్రచార రథం సెప్టెంబరు 1న బీజాపూర్ జిల్లాలోని బసవన్ బాగేవాడిలో ప్రారంభమైంది. బళ్లారిలో ఘన స్వాగతం పలకడానికి ఏర్పాట్లు చేపట్టారు. రథయాత్ర అన్నిజిల్లాల గుండా ప్రయాణించి అక్టోబర్ 5న బెంగళూరులోని ప్యాలెస్ గ్రౌండులో ముగుస్తుంది. ప్రచార యాత్ర నగరంలోని దుర్గమ్మ దేవాలయం మీదుగా బసవ భవన్ చేరుకుంటుంది. సాయంత్రం బసవ భవన్‌లోఉపన్యాసం ఉంటుందని లింగాయత్ మహా సభ ప్రముఖులు తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ శోభారాణి

గుర్తు తెలియని వ్యక్తి హత్య

బళ్లారి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రూపనగుడి రోడ్డు వైపు ఉండే ఒక రైస్‌మిల్ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి హత్యకు గురైనట్లు జిల్లా ఎస్పీ శోభారాణి తెలిపారు. శుక్రవారం ఎస్పీ, ఇతర పోలీసులు ఘటనా ఘటనా స్థలం వద్ద పంచనామా చేశారు. గుర్తు తెలియని వ్యక్తిని బండరాళ్లతో తలపై కొట్టి చంపినట్లు వారు తెలిపారు. హత్యకు గురైన వ్యక్తి ఎవరు. ఎందుకు ఇక్కడ అతన్ని చంపారు అన్నవాటిపై పూర్తీ వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని విమ్స్‌ఆసుపత్రి పోసుమార్టం రూంలో ఉంచినట్లు ఎస్పీ తెలిపారు.

వరుస వర్షాలతో రైతుల్లో ఆందోళన



తిమ్మల్‌పూర్ వద్ద జొన్నలను ఆరబెడుతున్న రైతులు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా విజయనగరం, బళ్లారి జిల్లాల్లో కురుస్తున్న వర్షాలు రైతుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఈసారి అత్యధిక విస్తీర్ణంలో నాటిన మొక్కజొన్న పంటలు ఇప్పటికే కొత దశకు చేరుకున్నాయి. చాలా మంది రైతులు ఇప్పటికే కోత కోసి ధాన్యాన్ని కుప్పలుగా పోశారు. విజయనగరం జిల్లాలోని హరువనహళ్ళి, చిలకనహట్టి, తిమ్మల్‌పూర్ ఇతర ప్రాంతాలలో వెయ్యి ఎకరాలకు పైగా భూమిలో జొన్న పండించారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా రైతులు కోసిన ధాన్యాన్ని ఆరబెట్టడానికి ఇబ్బంది పడుతున్నారు. వారు పంటలను రక్షించుకోవడానికి ప్లాస్టిక్ టార్పాలిన్లను వాడుతున్నారు. మరియమ్మనహళ్ళి తండా సమీపంలో వంద మందికి పైగా రైతులు టార్పాలిన్లతో కప్పబడిన గోతులు తెరిచి పండించిన ధాన్యాన్ని ఆరబెడుతూ కనిపించారు.

ముగ్గురికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు



అవార్డుకు ఎంపికయిన ఉపాధ్యాయులు

కంప్లి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : తాలుకాలో ముగ్గురు ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. వీరికి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. అందులో కంప్లి కోటే ప్రాథమిక పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయుడు హోస్కేరప్ప, దేవసముద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన హెచ్ బసవన్నగౌడ, శివపుర మెట్రీ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు గాదెనింగప్పలు ఎంపికయ్యారు. వారి పిల్లలకు చురుకైన బోధన క్రీడలు, పర్యావరణం, పాఠశాల వాతావరణం, సమయ నిర్వహణ, లైబ్రరీ నిర్వహణ, మధ్యాహ్న భోజన నిర్వహణ, మార్గదర్శకత్వం వంటి వివిధ మంచి అంశాలను పరిగణనలోకి తీసుకుని జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందించినట్లు బీఈవో టీఎం సిద్దలింగమూర్తి తెలిపారు. వీరికి సెప్టెంబరు 19న బళ్లారిలో జరిగే ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును పంపిణీ చేస్తామని తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ముగ్గురు ఉపాధ్యాయులకి తాలుకాలో ఉపాధ్యాయులు వారికి అభినందనలు తెలిపారు.

ఉచిత ఆరోగ్య పరీక్షలు



మాట్లాడుతున్న డాక్టర్ ప్రమోద్

బళ్లారి సిటీ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీరాంపుర కాలనీ 3వక్రాస్ రోడ్డులో ఉచిత ఆరోగ్య తనిఖీ ఆరోగ్య అవగాహన శిబిర కార్యక్రమాన్ని ఎస్‌యూసీఎస్ శుక్రవారం నిర్వహించింది. ఈసందర్భంగా ఎస్‌యూసీఐ కార్యదర్శి డాక్టర్. ప్రమోద్ మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆరోగ్య సౌకర్యాలు క్షీణిస్తున్నాయన్నారు. ప్రభుత్వం అన్ని సౌకర్యాలతో కూడిన ఆరోగ్య సౌకర్యాలను అందించాలన్నారు. ప్రజలు ఐక్యంగా ఉండి ఆరోగ్య హక్కుకోసం ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలన్నారు. అనంతరం పలువురికి రక్తపోటు తదితర ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈసందర్భంగా ఈశ్వరీ, డాక్టర్ అఖిల్, శరత్, విద్యావతి, రేఖ స్థానిక మురళీకృష్ణ ,ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ వార్డెన్ సస్పెన్షన్



నగరంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్

రాయచూరు సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని సాఘిక సంక్షేమ శాఖ విద్యార్థి వసతి గృహంలో వార్డెన్‌గా పని చేస్తున్న దేవరాజు పై జడ్పీ సీఈఓ ఈశ్వర్ కుమార్ కాందూ సస్పెన్షన్ వేటు విధించారు. ఉన్న విద్యార్థులకంటే ఎక్కువ సంఖ్యను ప్రభుత్వానికి చూపించడం ద్వార పెద్ద ఎత్తున నిధుల దురక్వినియోగానికి పాల్పడినట్లు విచారణలో వెల్లడి కావడంతో ఈ మేరకు దేవరాజును సస్పెన్షన్ వేటు విధిస్తూ శుక్రవారం జడ్పీ సీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన ఉప లోకాయుక్త న్యాయమూర్తి బీ వీరప్ప, ఎస్పీ, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారులతో కలిసి ఆకస్మికంగా హాస్టల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ కేవలం విద్యార్థులు 159 మాత్రమే ఉండగా వారి సంఖ్యను 400కు పైగా ఉన్నట్లు రిజిస్టర్‌లో నమోదు చేసి ఉండడాన్ని గుర్తించారు. దీంతో పాటు అక్కడి విద్యార్థులతో మాట్లాడిన అధికారులకు పలు అక్రమ విషయాలు వెలుగులోకొచ్చాయి. నాసిరకంగా భోజనం వడ్డించడం, వసతులు సక్రమంగా కల్పించకపోవడంతో పాటు ప్రశ్నించిన విద్యారుథల పట్ల దౌర్జన్యంగా వ్యవహరించాడంటు వార్డెన్ పై విద్యార్థులు ఫిర్యాదు చేశారు. వీటన్నిటి ఆధారంగా క్షేత్రస్థాయి విచారణ జరిపి తక్షణ చర్యలు చేపట్టాలంటు ఉప లోకాయుక్త జిల్లా అధికారిని ఆదేశించారు. ఈ క్రమంలో జిల్లా అధికారి ఆదేశాల మేరకు జడ్పీ సీఈఓ విచారణ జరిపి ఆయన పై చర్యలు చేపట్టారు.

నిమజ్జనానికి తరలిన గణనాథులు



ఊరేగింపులో గణనాథుడు



గంగమ్మ ఒడిలోకి చేరుతూ..

రాయచూరు సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి సందర్భంగా నగరంలోని వివిధ మండపాల్లో ప్రతిష్టించిన వినాయకులు 9వ రోజు పెద్ద ఎత్తున గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు నిమజ్జనానికి తరలాయి. ఈ సందర్భంగా నగరంలో సాగిన శోభాయత్ర కోలాహలంగా ముగిసింది. ప్రధాన రోడ్ల పై సాగిన ఊరేగింపులో వేలాది మంది భక్తులు, యువకులు పాల్గొని నృత్యాలు చేస్తు శోభాయత్రకు అందాన్ని తెచ్చి పెట్టారు. కాగా నగరంతో పాటు చుట్టుపక్కల దాదాపు 346కు పైగా విగ్రహాలను నగరంలోని చారిత్రక ఖాసభావిలో నిమజ్జనం చేశారు. ఇందుకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశరు.

నేడు హిందూ మహాగణపతి నిమజ్జనం



హిందూ మహాగణపతి

సిరుగుప్ప, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విశ్వహిందూపరిషత్, భజరంగదళ్ ఆధ్వర్యంలో హిందూ మహాగణపతి నిమజ్జన కార్యక్రమం శనివారం జరుగనుంది. పట్టణంలోని నరసింహ మూర్తి ఆవరణంలో హిందూ మహా గణపతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి 11 రోజులు ఘనంగా పూజలు చేశారు. కావడంతో జిల్లా ఎస్పీ శోభారాణి ఆధ్వర్యంలో వినాయక నిమజ్జన ఊరేగింపుకు వెయ్యి మంది పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హైస్కూలు గ్రౌండ్ నుంచి తుంగభద్ర నది వరకు దేశనూరు రోడ్డు మార్గంలో మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో శోభాయాత్ర జరుగనుంది. ప్రముఖ సెంటర్లలో అన్నదాన సేవా కార్యక్రమాలు కూడా చేపట్టారు. తాలుకా వ్యాప్తంగా వున్న ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ కార్యకర్తలు కోరారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



సంబరాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

బళ్లారి రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): బళ్లారి రూరల్ తాలుకాలోని గోడేహాళ్ వద్ద ఉన్న తిరుమల స్కూలు ఆవరణంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కరెస్పాండెంట్ యల్లప్ప సర్వేపల్లి రాధాకృష్ణన్ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ యల్లప్ప, హెచ్‌ఎం నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి గుంతలో పడిన బాలుడి మృతి

● ఆరు గంటలు కృషి చేసినా దక్కని ఫలితం



బాలుడి మృతదేహాన్ని బయటికి తెచ్చిన అగ్నిమాపక సిబ్బంది

రాయచూరు సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కృష్ణగిరి హిల్స్ కాలనీలో శుక్రవారం నీటిగుంతలో పడిపోయిన బాలుడి శవం ఆరు గంటల అన్వేషించినా ఫలితం లేకుండా పోయింది. బాలుడు విగతజీవిగా మారడంతో తల్లి దండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. కాలనీకి చెందిన 9వ తరగతి విద్యార్థి గౌతమ్ మిత్రులతో కలిసి గుట్ట సమీపంలోని శుక్రవారం మధ్యహ్నం నీటి గుంతలో చేతులు గడుకునే ప్రయత్నం చేయగా కాలు జారీ పడి పోయాడు. బాలుకుడి కోసం స్థానికులు కొంతమంది ప్రయత్నించినా లభ్యం కాకపోవడంతో అగ్ని మాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దాదాపు ఆరు గంటల పాటు శ్రమించిన సిబ్బంది నీటి గుంటలో రాళ్ల మధ్య పడి ఉన్న బాలుడి శవాన్ని సాయంత్రం ఏడు గంటల సమయంలో బయటికి తెచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. కాగా ఆడుతు పాడుతు కళ్ల మందున్న తమ కుమారుడు నీటి గుంతలో పడి మృత్యువాత పడడంతో తల్లిదండ్రులతో పాటు బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.



ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారాంను సన్మానిస్తున్న రాజశేఖర్

పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా: ఎమ్మెల్యే

కంప్లి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రజలకు అన్ని సమస్యలను పరిష్కరించి, మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేసి జిల్లాలోనే ఆదర్శ పట్టణంగా మారుస్తానని ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారాం అన్నారు.. శుక్రవారం కుడితిని పట్టణంలో స్థాయి సమితి అధ్యక్షులు వి రాజశేఖర్ నూతనంగా ఏర్పాటు చేసిన భరత్ ఓ దుకాణాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే గౌతమ్ నగర్‌లో ప్రభుత్వాస్పత్రి విద్యార్థులకు యువకులకు అనుగుణంగానే క్రీడాంగణం అలాగే మహిళలకు సముదాయ భవనం ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే ప్రతి గ్రామంలో సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నామన్నారు. కుడితిని పట్టణంలో కూడా మిగిలి ఉన్న పనులు కూడా త్వరగా పూర్తి చేసి అందరికీ ఆకట్టుకునేలా ఈ పట్టణాన్ని తీర్చిదిద్దుతామని తెలిపారు. వారితో పాటు కేఎస్‌ఎల్ స్వామి ఏకాంబరం రాము పల్లెదప్రభు ఆశాలత ఉపాధ్యక్షులు కనికేరి పంపాపతి, కౌన్సిలర్ వెంకటరమణ బాబు, దొడ్డ బసప్ప సత్యప్ప, దొడ్డప్ప, వీకేసీ సొసైటీ ప్రెసిడెంట్ యర్రిస్వామి, ప్రతాప్, రామ గంగాధర్, మహంతేష్, అరిలిరి వీరేష్, జనార్దన్, గురుమూర్తి, అంబన్న, నలినీ, రేష్మ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో కీర్తిని చాటాలి: ఎమ్మెల్యే

మడకశిరటౌన్, (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో మడకశిర కీర్తిని చాటాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సూచించారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులను మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో కలిసి అభినందించారు. రాష్ట్రస్థాయిలో జరిగే వాలీబాల్ పోటీల్లో విజయం సాధించి వెనకబడిన ప్రాంతానికి మంచి గుర్తింపు తీసుకురావాలని సూచించారు. క్రీడాకారులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా అభిమన్యు యూత్ అసోసియేషన్ సభ్యులు నాగేంద్ర కుమారస్వామితో పాటు రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడా పోటీలకు ఎంపికైన క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్



ఓనం సంబరాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఘనంగా ఓనం సంబరాలు

హోసూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అదియమాన్ పాలిటెక్నిక్ కళాశాలలో ఓనం పండుగ సంబరంగా సాగింది. కళాశాల చీఫ్ బాలాజి ప్రకాశ్ ముఖ్యులుగా పాల్గొని పండుగ ప్రాధాన్యత వివరించారు. విద్యార్థినులు ఉత్సాహంగా రంగవల్లులు వేశారు. ఉపాధ్యాయులతోపాటు నాగరాజన్, ఖువియరసు, సరళ, నానీ తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్‌ఐలో నమోదుకు స్పెషల్ డ్రైవ్



ప్రసంగిస్తున్న అధికారి శివరామకృష్ణన్

హోసూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలో పారిశ్రామికవాడలు ఉన్నాయి. కార్మికులకోసం నమోదు చేయని సంస్థలకోసం అవకాశం కల్పించేలా ఎస్‌పీఆర్‌ఈఈ 2025 పేరిట స్పెషల్ డ్రైవ్ శుక్రవారం నిర్వహించారు. డిసెంబరు ఆఖరు వరకు కొనసాగనుంది. సేలం ఇఎస్‌ఐ డైరెక్టర్ శివరామకృష్ణన్ పాల్గొని మాట్లాడుతూ కార్మికులకు సామాజిక భద్రత కల్పించడమే ఈఎస్‌ఐ లక్ష్యమన్నారు. జూలై 1న డ్రైవ్ ప్రారంభమైందని అర్హులైన సంస్థలు నమోదు చేసుకుని కార్మికులకు వీలు కల్పించాలన్నారు. జీతంలో ఎస్‌ఎస్‌ఐ మినహాయింపు అయ్యేలా చేసుకోవడం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇఎస్‌ఐ ద్వారా ఆరోగ్య ప్రయోజనాలు, పీఎఫ్ వంటివి ఉంటాయన్నారు. సుమారు 85 సంస్థల ప్రతినిధులు, వైద్య అధికారి సుబ్రమణ్యన్, ప్రాంతీయ పరిపాలనా వైద్య అధికారి గురుప్రసాద్ పాల్గొన్నారు.



కంప్లి : ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే గణేష్



గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి



స్థాయి సమితి అధ్యక్షుడు రాజశేఖర్



సిరుగుప్పలో..

భక్తిశ్రద్ధలతో మిలాద్-ఉన్-నబీ

కంప్లి/బళ్లారి రూరల్/రాయచూరు/సిరుగుప్ప, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : మిలాద్-ఉన్-నబి వేడుకలను ముస్లింలు శుక్రవారం పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. కంప్లి, గంగావతి, కుడితిని, కురుగోడు పట్టణాల్లో ప్రార్థనలు, ఊరేగింపులతో సంబరాలు జరుపుకున్నారు. అనంతరం మక్కా మదీనా చిత్రాలను వీదుల్లో ఊరేగించారు. కంప్లి పట్టణంలో శుక్రవారం ఊరేగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే గణేష పురసభ అధ్యక్షులు ప్రసాద్, ముస్లిం సమాజం గురువులు తదితరులు పాల్గొన్నారు. గంగావతిలో ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి ఈద్ మిలాద్ పండుగ వేడుకల్లో పాల్గొని జరుపుకున్నారు. కుడితిని పట్టణంలో ఊరేగింపు కార్యక్రమంలో పట్టణ పంచాయతీ స్థాయి సమితి అధ్యక్షుడు రాజశేఖర్ పాల్గొన్నారు



రాయచూరులో..